సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - ఆలమూరు

సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఛైర్పర్సన్ గండి పద్మ అన్నారు. ఆలమూరులో ఆమె అధ్యక్షతన శనివారం స్థానిక సమత మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ సిఇఓ దాసు ఆధ్వర్యంలో సహకార వ్యవస్థపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార వ్యవస్థ అభివృద్ధి కోసం పనిచేస్తే సమాజంలో అభివృద్ధి చెందుతామన్నారు. పొదుపు చేసుకున్న సొమ్ము భవిష్యత్తు అవసరాల కోసం ఉపయోగ పడుతుందన్నారు. సభ్యులకు సులభంగా రుణాలు అందిస్తున్నాం కాబట్టి వాటిని సద్వినియోగించుకోవాలన్నారు. రుణాలు తిరిగి సక్రమంగా చెల్లించడం ద్వారా సంస్థ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సమత మేనేజర్ ఎం.రాము, ఆర్గనైజర్ బిఆర్.సహవాసరావు, కె.వరలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, ఎస్.సురేష్, మహిళలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

- ప్రభుత్వ నిబంధనలతో రైతులకు ఇబ్బందులు
- అయిన కాడికి దోచుకుంటున్న దళారులు

ధాన్యం బస్తాలు పట్టుబడి పడుతున్న రైతులు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్మితే రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పెట్టే నిబంధనలతో రైతు చేసేదేమీ లేక మళ్లీ దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం ఖరీఫ్ పంట ధాన్యం కొనుగోలు ప్రారంభించడంతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలని ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దష్టి సారించి దళారులు ప్రమేయం లేకుండా చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 5లక్షల హెక్టార్లులో రైతులు రబీ వరి సాగు చేశారు. సుమారు 12లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. పంట చేతికి వచ్చే సమయానికి ప్రకతి వైపరీత్యాల బెడద రైతులను వెంటాడుతుంది. అకాల వర్షాలు తుఫాను కారణంగా చేతికొచ్చిన పంట నేలపాలు అవుతోంది .దీంతో దళారులు రైతుల దగ్గర నుండి ధాన్యం అయిన కాడికి కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర లభించక దిగాలు అవుతున్నారు. గడిచిన రెండు ఖరీఫ్ సీజన్లో వరుస తుఫానులు కారణంగా ధాన్యం పూర్తిగా తడిసిపోయి రంగు మారిపోవడంతో రైతులు ధాన్యం బస్తాకు రూ.400 నుంచి రూ.500 వందలు వరకు నష్టానికి అమ్ముకోవాల్సిన పరిస్థితి మనం చూశాం. ఇక కోనసీమ జిల్లాకు వస్తే జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కోసం 380 రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించి అధికారులు తగు సలహాలు సూచనలు అందజేశారు. మద్దతు ధర వస్తుందని ధాన్యం ప్రభుత్వానికి అమ్మితే రెండు రోజుల్లో ధాన్యం సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలో జమవుతుందని అధికారులు చెబుతున్నారు. రైతు ధాన్యం అమ్మిన నగదు సరైన సమయానికి అందకపోవడంతో ఆ ప్రభావంతో తర్వాతి పంట పెట్టుబడి కూడా ఇబ్బంది అవుతుంది. దీంతో అధిక మంది రైతులు దళారులు వ్యాపారులు పైన మొగ్గు చూపుతున్నారు. దీని ఫలితం రైతులకు మద్దతు ధర కోల్పోవాల్సి వస్తుంది.

గిట్టుబాటు ధర రాక కుదేలు

.ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలు ధాన్యం రూ.2320 గా నిర్ణయించింది. దాని ప్రకారం ఏ గ్రేడ్ 75 కిలోల బస్తా రూ.1,740 కాగా సాధారణ రకం 75 కేజీలు బస్తా రూ.1725, క్వింటాలు రూ.2,300 రావాలి. కానీ రూ.1500 నుంచి రూ.1550 మధ్య లోనే రైతుల నుంచి దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల రైతులు సుమారు రూ.200 నష్టపోతున్నారు. ఈ క్రాప్ నమోదు కాక రైతులు పండించిన పంట రైతు భరోసా కేంద్రాల్లో అమ్మలేకపోతున్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ధ్యాన్యం సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో వేసినా ధాన్యం బస్తా కు ముందుగా దళారి మాట్లాడుతున్న రేటు ప్రకారం రైతులకు చెల్లించాల్సిన మిగిలింది దళారుల జేబులోకి వెళుతుంది. దీంతో రైతులు పండిన పంటకు గిట్టుబాటు ధర రాక కుదేలు అవుతున్నాడు.

ప్రభుత్వ నిబంధనలు ఇలా

రైతులు పండించిన ధాన్యం లో మట్టి రాళ్ల చెత్త పొల్లు వంటివి ఒక శాతం మించకుండా ఉండాలని రంగు మారిన మొలకెత్తిన పురుగులు పట్టిన ధాన్యం 5 శాతం మించకూడదని నిబంధనలు ఉన్నాయి. అలాగే రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా రైతు ధాన్యము కావడానికి వీలులేదు.

అధికారులు ఏం చెబుతున్నారు

రైతు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర రావాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం ద్వారానే ధాన్యం కొనుగోలు చేస్తామని తెలుపుతున్నారు. రైతులు దళారులు మధ్యవర్తుల చేతిలో మోసపోకుండా నేరుగా రైతు భరోసా కేంద్రం సంప్రదించి తాము పండించిన పంటకు మద్దతు ధర పొందాలని తెలుపుతున్నారు. ధాన్యం అమ్మిన 2 రోజులలోపు లో రైతు యొక్క ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తుందని వారు తెలిపారు.

ఎంఎల్‌సి పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ

ప్రజాశక్తి - అమలాపురం

వచ్చే నెల 5న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి పోలింగ్ ప్రక్రియ శాంతియుత వాతావరణం లో సజా వుగా నిర్వహించా లని జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్‌మోహనరావు ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు జిల్లాలో ఏర్పాటు చేసిన 22 పోలింగ్ కేంద్రాలకు నియమించిన ప్రిసైడింగ్, ఇతర ప్రిసై డింగ్, అధికారులతో మొదటి దఫా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారని డిసెంబర్ 5న పోలింగ్, డిసెంబర్ 9న కాకినాడ జెఎన్‌టియులో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత్ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పూర్తిగా అనుకరించాలని ఆయన స్పష్టం చేశారు. రిసోర్స్ పర్సన్ మరియు మండ పేట తహశీల్దార్ తేజేశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ప్రచార కార్యక్రమాలను అనుమతిం చరాదన్నారు. మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో స్వీకరించిన 45 రకాల మెటీరియల్‌ను సజావుగా నింపుతూ మరలా రిసెప్షన్ సెంటర్లో సమర్పించాలన్నా రు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రం వద్ద సాయంత్రం నాలుగు గంటలకు క్యూలైన్లో ఉన్న ఆఖరి ఓటరుకు ఒకటో నెంబర్ క్లూపన్ జారీ చేస్తూ వారందరి చేత ఓటింగ్ చేయించి తదుపరి బ్యాలెట్ బాక్స్ కు షీల్డ్ ట్యాగులు వేయా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ వి.శివశంకర్ ప్రసాద్ వివిధ శాఖలకు చెంది పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

పాల్గొన్న వివిధ శాఖలకు చెందిన అధికారులు

'రాజారత్న కిట్స్'లో 63వ ఫార్మసీ వారోత్సవాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం లో గల శ్రీ రాజారత్న కిట్స్ కళాశాల్లో శనివారం 63వ ఫార్మసీ వారోత్సవాలను నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఈ ఏర్పాటు చేసిన ర్యాలీలో విద్యార్థులు పాల్గొన్నారు. థింక్ హెల్త్, థింక్ ఫార్మసీ అనే నినాదంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదగా స్థానిక రాజగోపాల్ సెంటర్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడారు. ఫార్మసి విద్య వల్ల ప్రయోజనాలు, సమాజంలో ఫార్మసిస్ట్ ఆవశ్యకత వివరించారు. కళాశాల డైరెక్టర్ ఎం.పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఫార్మసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేశ్వరితో పాటు ఉపాధ్యాయ బృందం, యాజమాన్యం, సిబ్బంది,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫార్మసీ వారోత్సవాల్లో పాల్గొన్న రాజారత్న కిట్స్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

ట్రాఫిక్ నిబంధనలు, భద్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతీ నెలా నిర్వహించే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా ఈ నెల సురక్షిత భారత్ అనే నినాదంతో ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతలపై అవగాహనా ర్యాలీ శనివారం నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం వద్ద మానవ హారాన్ని నిర్వహించి రోడ్ భద్రత పై నినాదాలు చేస్తూ, పట్టణ పోలీసుల సహకారంతో ప్రజలలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ పి.వీరబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ రీజనల్ ఇంచార్జి పి.శ్రీనివాస్, జోనల్ కో ఆర్డినేటర్ టి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ వసు , స్కూల్ డీన్ అరవ శ్రీను, ప్రోగ్రాం ఇం చార్జి జి.శ్రీనివాస్ ఉమామహేశ్వర రావు పట్టణ ఎస్ఐలు కిషోర్ బాబు, పి.భగ వాన్ నారాయణ పి.శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ ఎం.ఏసుబాబు, ఎఎస్ఐ జమిందార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న 'శ్రీ చైతన్య' విద్యార్థులు

చిన్నారులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మూర్తి

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

చిన్నారుల ఆరోగ్యం పట్ల వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు, రోహిణి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వివిఎస్ఎస్ఎన్.మూర్తి అన్నారు. శనివారం గున్నేపల్లి అగ్రహారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెద్దిరెడ్డి రాము అధ్యక్షతన చిన్నారుల ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో డాక్టర్ మూర్తి 80 మంది చిన్నారులకు వైద్య పరీక్ష చేసి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మూర్తి మాట్లాడుతూ 15 సంవత్స రాలుగా అమలాపురం చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ప్రతి నెలలా ఒక గ్రామం లో తాను వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా సుమారు రూ.300 నుంచి రూ.400 విలువ చేసే మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యు లు కేత శ్రీలక్ష్మి, అనపిండి సీతారామయ్య, నాగభూషణం, పెద్దిరెడ్డి శ్రీరామ్ మూర్తి, పెద్దిరెడ్డి రామకృష్ణ, ఏడుకొండలు, కేత పెదబాబు, పెద్దిరెడ్డి సురేష్, కొమ్మల భాస్కరరావు, చొల్లంగి సాయిబాబు, ఎఎన్ఎం గంగాభవాని, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ వన సమారాధన విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురంలో ఈ నెల 24న ఆదివారం ప్రతిష్టాత్మకరంగా నిర్వహి స్తున్న శెట్టిబలిజ వనసమారాధనను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ శెట్టి బలిజ వన సమారాధన మిగిలిన కులాలకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. యువత ఎటువంటి హంగామా చేయవద్దని సైలెన్సర్లు తీసి వెహికల్స్ నడపవద్దని, పోలీసులకు పూర్తిగా సహకరించాలని మంత్రి కోరారు. ఎంఎల్‌సి కుడుపూడి సూర్య నారాయణ రావు మాట్లాడుతూ సంఘీయుల పటిష్టతకు వన సమారాధన లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమం లో నేతలు పెచ్చెట్టి చంద్రమౌళి, వాసంశెట్టి సత్యం, మట్టపర్తి నాగేంద్ర, వాసంశెట్టి చినబాబు తదితరులు పాల్గొన్నారు. వన సమారాధనకు సంబంధించిన ఏర్పాట్లను అమలాపురం స్థానిక కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో మంత్రి సుభాష్, వారి తండ్రి వాసంశెట్టి సత్యం, ఇతర సంఘ నాయకులతో శనివారం పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్వల్ప వ్యవధిలో ఈ వన సమారాధన నిర్వహిస్తున్నామని, ఇదే మా ఆహ్వానంగా భావించి ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన శెట్టి బలిజ నాయకులు, ప్రజలు ఆత్మీయ సమ్మేళనంకు హాజరుకావాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వికలాంగుని కుటుంబానికి న్యాయం చేయాలని కోనసీమ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. మండలంలోని బండారులంక ప్రాంతంలో ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో వికలాంగుడు జిత్తుక శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాసరావు శనివారం మృతి చెందాడు. శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కోనసీమ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగవరపు పరశురాముడు ఆధ్వర్యంలో అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు.మతుని కుటుంబానికి న్యాయం చేయాలని వైసిపి నాయకులు ఒంటెద్దు వెంకన్న నాయుడు మద్దతు తెలిపారు.

పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వికలాంగులు

కార్యకర్తలకు అండగా ఉంటా

ప్రజాశక్తి - మండపేట

తనతో పాటూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. అంచనాల కమిటీ ఛైర్మన్ గా ఎన్నికైన తరవాత తొలిసారి గా శనివారం ఉదయం ఆయన పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. ఎంఎల్ఎ వేగుళ్లను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఎంఎల్ఎ వేగుళ్లను సత్కరిస్తున్న కూటమి నాయకులు

ఎంఎల్ఎ వేగుళ్ల ఎంపికపై హర్షం

కపిలేశ్వరపురం : మండపేట నియోజకవర్గ ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావుకు క్యాబినెట్ హోదా దక్కడంపై జనసేనపార్టీ ఇంచార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. లీలాకృష్ణ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ గా ఎంఎల్ఎ వేగుళ్ల ఎంపిక అవ్వడం సంతోషంగా ఉందన్నారు.

ఇంటి పన్నుల ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో వివిధ గ్రామాల్లో శనివారం ఎంపిడిఒ ఎ.రాజు పర్యటించి ఇంటి పనుల ఆన్లైన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పన్నుల విధానాన్ని ఆన్లైన్ చేయాలని ప్రభుత్వ నిర్ణయించి ందన్నారు. ఇంటి పన్నుల ఆధుని కీకరణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఇప్పటివరకు ఇంటి పన్ను, కుళాయి పన్నులకు డిమాండ్ నోటీసులు అందిస్తూ ఇంటి కొలతల ప్రకారం పన్ను అందించే వారిని, అయితే కొత్త విధానంలో ప్రతి ఇంటికి ఉన్న కొలతలను ఆన్లైన్ చేసి నిబంధనల ప్రకారం చదరపు అడుగుకు నిర్దేశించిన పన్నులను విధిస్తారన్నారు. మండ లంలో ఇంటి పన్నుల ఆన్లైన్ ప్రక్రియను సచివా లయం సిబ్బంది ఇప్పటికే మొదలుపెట్టారన్నారు. అయితే ఇంటింటికీ వెళ్లి కొలతలను పరిశీలించి అందులో ఏమైనా మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే పరిశీలిస్తారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు వివరాలను సేకరించి ఇళ్ల పన్నుకు సంబంధించిన ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తారన్నారు. స్వర్ణ గ్రామపంచాయతీ పోర్టల్ లో ఇంటి పన్ను కట్టిన, కట్టలేనివారి వివరాలు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. మండలంలో 26 వేల కుటుంబాలకుగాను 18,300 ఇంటి పన్నులు ఉండగా 1100 పన్నుల ఆన్లైన్ ప్రక్రియను సిబ్బంది పూర్తి చేశారన్నారు.

ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఎ.రాజు

శిక్షణ ఇస్తున్న గ్రాండ్ మాస్టర్ అబ్బులు

27 నుంచి ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ వీరుడు పేరొందిన బ్రూస్లీ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 27 నుంచి ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణలు ఇస్తున్నట్లు కొత్తూరు సెంటర్ వద్ద మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి వాటి నుండి బయటపడలేక అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. అలాంటి వారికి ఈ మార్షల్ ఆర్ట్స్ ఉపయోగకరమవుతుందన్నారు. ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7:30 వరకు కొత్తూరు సెంటర్ బస్టాండ్ పక్కన రైస్ మిల్లు వద్ద ఆలమూరు, అంగర, మండపేట లలో మార్షల్ ఆర్ట్స్ వ్యాయామ శిక్షణలు ఇస్తున్నామన్నారు.

నేడు హోమియో ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో ఉచిత హోమియో ఆసుపత్రి ఈ నెల 24వ తేదీ ఆదివారం ప్రారంభిస్తున్నట్లు పట్టణానికి చెందిన చేకూరి పాపారావు, కాంతకుమారి దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాపారావు మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే మానవతా దృక్పథంతో ఈ హోమియో ఆసుపత్రి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ విద్యావేత్త, మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జివి.రావు చేతుల మీదుగా తిలక్ మెమోరియల్ హాల్ నందు ఆదివారం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. హోమియో రంగంలో పేరుగాంచిన డాక్టర్ పోలిన సూర్య భగవాన్, డాక్టర్ చలికి శ్రీనివాసరావు, డాక్టర్ బెల్లంకొండ కృష్ణమోహన్ ప్రజలకు వైద్యసేవలు అందజేస్తారని వివరించారు. ప్రజలు ఈ సదవకాశం ఉపయోగించుకోవాలన్నారు.

మహిళల ఆర్థిక పరిపుష్టికి మెప్మా మార్కెట్ల దోహదం

నగర పంచాయతీ ఛైర్మన్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మహిళల ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి మెప్మా అర్బన్ మార్కెట్లు దోహదం చేస్తాయని నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ సూచించారు. నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను శనివారం ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెల్లె అశోక్ పిల్లి నాగరాజు, మెండి కమల, కమిషనర్ పి.రవివర్మ మేనేజర్ పివి.నూకరాజు, ఆర్ఐ భాస్కర రావు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎస్ .భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా బజార్ ను ప్రారంభిస్తున్న ఛైర్మన్ ప్రవీణ్ కుమార్

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కొత్తలంక పంచాయతీ పరిధిలోని సాకి రేవు చెరువు సిద్ధార్థ నగర ప్రాథమిక పాఠశాలలో శనివారం బార్ ప్రెసిడెంట్ దాసరి సత్య నారాయణ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నిర్బంధ విద్యా హక్కు చట్టానికి లోబడి 14 ఏళ్ల లోపు పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు పర్యవేక్షణలో శ్రద్ధగా చదివి లక్ష్యాలను చేరుకోవాల న్నారు. కార్యక్రమంలో అడ్వకేట్స్ కాశి సిద్ధార్థ కుమార్, వడ్డీ త్రిమూర్తులు, పారా లీగల్ వలం టీర్లు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

'వాడపల్లి'కి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం ఈ యాత్రికులు పోటెత్తారు. స్వామివారికి వేకువ జామునే సుప్రభాత సేవ అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారు. కార్తీక మాసం శనివారం కావడంతో తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో యాత్రికులు రావడంతో ఆలయ ప్రాంగణం తో పాటు వాడపల్లి గ్రామం అంతా యాత్రికులతో నిండిపోయింది. సుమారు లక్ష మంది యాత్రికులు స్వామివారి దర్శించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిసి నల్లం సూర్యచంద్రరావు ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు. రావులపాలెం సిఐ సిహెచ్.విద్యాసాగర్ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటల వరకు యాత్రికుల రద్దీ కొనసాగింది. స్వామివారికి రూ.42 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలియజేశారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

వచ్చే నెల 14న నిర్వహించనున్న లోక్అదాలత్‌ల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి అందరూ కృషి చేయాలని జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్ పోలీసులతో అన్నారు. మండల కేంద్రంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్ట్ నందు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులను సామరస్య పూర్వక వాతావరణంలో సత్వరంగా న్యాయం అందించేందుకు కేసులు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు మండపేట కపిలేశ్వరపురం మండలాలకు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కోర్టులో ఎక్సైజ్, పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్ కుమార్

నేరాలు ఘోరాలు

చోరీకి సంబంధించి వివరాలు తెలుపుతున్న డిఎస్‌పి ప్రసాద్

ఆయిల్ చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - అమలాపురం

ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామంలో ఒఎన్‌జిసి వెల్ నుంచి ఆయిల్ దొంగతనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులతోపాటు, దొంగిలించిన ఆయిల్‌ను విక్రయాలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ వివరాలను వెల్లడించారు. ఉప్పలగుప్తం మండలం గోపవరంలో వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో నిందితులను ఉప్పలగుప్తం పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. దొంగిలించిన వైట్ ఆయిల్ లీటరు రూ.50కు కొనుగోలు చేసి రూ.80 విక్రయిస్తున్నారని తెలిపారు. నిందితులు ఒఎన్‌జిసి వెల్‌కు పైపులైను బిగించి దాని ద్వారా ప్లాస్టిక్ టిన్నుల్లోకి వైట్ ఆయిల్ చోరీ చేస్తున్నారని అన్నారు. నిందితులు 5 నెలలుగా నెలకు 3 సార్లు వైట్ ఆయిల్‌ను దొంగిలిస్తున్నట్లు విచారణలో గుర్తించినట్లు తెలిపారు. చోరీ చేసే సమయంలో ఆయిల్ ప్రెజర్‌కు నాబ్ ఊడిపోయి పెద్ద శబ్దం రావడంతో నిందితులు పారిపోయినట్లు తెలిపారు. నిందితుల నుంచి నెంబర్ ప్లేటు లేని ద్విచక్ర వాహనం, 10 లీటర్ల వైట్ ఆయిల్, ఆయిల్ చౌర్యానికి వినియోగించిన ప్లాస్టిక్ డబ్బాలు, పైపులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేసిన అమలాపురం రూరల్ ఇన్‌ఛార్జ్ సిఐ పి.వీరబాబు, ఉప్పలగుప్తం ఎస్‌ఐ సిహెచ్.రాజేష్, సిబ్బందిని జిల్లా ఎస్‌పి కృష్ణారావు ప్రత్యేకంగా అందించారనీ డిఎస్‌పి తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

యువతి అదృశ్యంపై శుక్రవారం గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన ఆర్మీ మాజీ ఉద్యోగి గుండు శ్రీనివాసరావు కుమార్తె చైతన్య దుర్గ కాంపిటీషన్ ఎగ్జామ్స్ నిమిత్తం కొంతకాలంగా హైదరాబాదులో ఒక కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందు తోంది. ఈ నేపథ్యంలో అదే కోచింగ్ సెంటర్‌లో గల ఒక అబ్బాయితో చైతన్య దుర్గ సన్నిహితంగా ఉంటోంది. విషయం తెలుసుకున్న తండ్రి శ్రీనివాసరావు కుమార్తెను మందలించి ఇటీవల హైదరాబాదు నుంచి స్వగ్రామం తీసుకుని వచ్చాడు. అప్పటి నుంచి ఆ యువతి ఇంటి దగ్గరే ఉంటుంది. ఈ నేపథ్యంలోనే శ్రీనివాసరావు తోడల్లుడు అనారోగ్యంగా ఉండడంతో ఈ నెల 10న తన భార్య కుమార్తెను గొల్లప్రోలుకు పంపించాడు. బంధువులు ఇంటి వద్ద మూడు రోజులు పాటు ఉన్న చైతన్య దుర్గ ఈనెల 14వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయింది. ఉదయం చూసేసరికి చైతన్య దుర్గ కనిపించలేదు. కుమార్తె కోసం బంధువులు తెలిసున్న వారి ఇంటి వద్ద వెతికినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్‌ఐ పి.రామకృష్ణ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం నిర్వహించిన దాడుల్లో 600 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు, 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్‌రావు తెలిపారు. గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఎర్రంపాలెం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిలవజేసిన 10 డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ప్రజాశక్తి - పిఠాపురం

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా విధించినట్లు సిఐ జి.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రవ్ తనిఖీల్లో 23 మందిని అదుపులోకి తీసుకుని పిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ విజయ రామేశ్వరి వారికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారని అన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కోళ్లు, మేకలు, సెల్ ఫోన్లు దొంగతనాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం...గోకవరం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ మండలంలో దొంగతనాలకు పాల్పడుతుండగా తనకి వచ్చిన సమాచారం మేరకు రామవరం గ్రామ శివారున ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని వద్ద నుంచి సుమారు రూ.70 వేలు విలువైన 4 కోళ్లు, ఒక యునికార్న్ బండి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ముద్దాయిని కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

150 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న కోరంగి పంచాయతీ చిన బొడ్డు వెంకటాయపాలెంకు చెందిన పెసింగి వీరబాబును అదుపులోకి తీసుకుని, అతని నుంచి 150 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ నాగేంద్రకృష్ణ, హెచ్‌సి వెంకటేశ్వరరావు, పిసి విష్ణు పాల్గొన్నారు.

గంజాయితో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - దేవరపల్లి

గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ వి.సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రానికి చెందిన అమల్ కృష్ణ, మహమ్మద్ సాహుల్, సాహిల్ మొన్, అభినవ్ పునతిల్, రెండు మోటార్ సైకిళ్లపై మూడు బ్యాగ్‌లలో తరలిస్తున్న 40.550 కేజీల గంజాయి, బైకులను స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలిస్తున్నామని సిఐ బి.నాగేశ్వర్ నాయక్ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు.

కొండ దిగనంటున్న కూరగాయలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కార్తీక మాసం చివరిలోనూ కూరగాయల ధరలు కొండదిగనంటున్నాయి. గత నెల రోజులుగా ధరలు ఆకాశాన్నంటుతున్న విషయం విధితమే. టమోటా రూ.50 చొప్పున, కిలో మిచ్చి రూ.80 చొప్పున కొనుగోలు దారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చిక్కుడు కాయలు సైతం కిలో రూ.80 మార్కు దిగిరానంటున్నాయి. ఉల్లి ధరలు కేజీ రూ.70కి చేరాయి. టమోటా, ఉల్లిపాయలు ఈ రెండింటిలో ఏది ధర పెరిగినా వంట గదిలో రోజు గడవటం కష్టమే. అటువంటి ఈ ధరలు నెల రోజులుగా ఆకాశాన్నంటంటతో సామాన్యులకు కంటి మీద కునుకు కరువైంది. ఇక ఇతర కూరగాయలు సైతం కిలో రూ.50 పైమాటే. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలూ నింగిని తాకుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలు గడిచింది. ధరల నియంత్రణకు చేపట్టిన చర్యలు శూన్యమని స్పష్టమవుతోంది. మరోవైపు పప్పుల ధరలు నింగిని తాకుతున్నాయి. నూనెల ధరలూ పోటీపడుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ధరలు నియంత్రణకు చర్యలు చేపట్టకకపోతే ప్రజాగ్రహానికి గురికాకతప్పదనే అభిప్రాయ వ్యక్తమవుతోంది..

ప్రహసనంలా ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రహసనంలా మారింది. ప్రతి సీజన్‌లోనూ పాలనా యంత్రాంగం చిత్తశుద్ధి లోపు రైతులను నట్టేట ముంచుతోంది. ఈ ఏడాదీ నత్తనడక కొనుగోలు జరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4.50లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఇప్పటి వరకూ45 శాతం కోతలు పూర్తయినా ప్రభుత్వ కొనుగోలు లక్ష్యానికి పొంతనే లేదు. మరోవైపుమారిన వాతావరణ పరిస్థితుల కారణంగా గాలిలో తేమశాతం పెరిగింది. దీంతో ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలలో తేమ శాతం నిబంధనలు ప్రధాన అడ్డంకిగా మారినట్లు రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో 75 కేజీల బస్తాకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1630 కాగా రూ.1300 నుంచిరూ.1500 చొప్పున దళారులకు విక్రయిస్తున్నారు. ఆర్థికంగా నష్టపోతున్నారు. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు అధికంగా ఉన్నప్పటికీ రైతులకు మద్దతు ధర లభించడంలేదు.

చలి పులి

రోజు రోజుకి చలి తీవ్రత పెరగుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు 21 నుంచి 22 డిగ్రీల సెల్సియస్ మధ్యలో నమోదవుతోంది. 15 రోజుల క్రితం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల వరకు ఉండగా, వారం రోజుల్లో గణనీయంగా పడిపోయాయి. మరో వైపు ఉదయం వేళల్లో పొగ మంచు కమ్మేస్తోంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా నవంబరు మొదటి వారం నుంచే చలి పెరుగుతుంది. గడిచిన నెల రోజులల క్రమ క్రమంగా తీవ్రత పెరిగింది. సాయంత్రం వేళల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువైంది.ఈ నేపథ్యంలో శ్వాసకోస వ్యాధి గ్రస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వర పీడితుల సంఖ్య క్రమ క్రమంగా పెరగటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో ఓపీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

పోరుబాటలో ఉద్యోగ, కార్మిక వర్గాలు

తమ సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఉద్యోగులు, కార్మికులు పోరుబాట పట్టారు. 108 ఉద్యోగులు ఈ నెల 25నుంచి సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేసిన విషయం విధితమే. ప్రభుత్వ నిర్లక్ష్యం సామాన్యులకు వైద్య సేవలు దూరం కానున్నాయి. అదే విధంగా ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్లు దద్ధరిల్లాయి. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలు మరింత తీవ్ర రూపం దాల్చే పరిస్థితులు నెలకొన్నాయి.

మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - ఆలమూరు

డ్వాక్రా మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని ఎపిఎం ఎం.ధనరాజు మాజీ డిసి అధ్యక్షులు ఎన్ వెంకటరత్నం, మాజీ ఎంపిటిసి సభ్యుడు ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. చెముడులంకలో డ్వాక్రా మహిళలకు(ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్) వ్యక్తిగత లోన్ల మంజూరుపై ఎపిఎం ధనరాజు ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.వెంకటరమణ, స్థానిక కూటమి నాయకుల సమక్షంలో శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ మహిళలు చేపట్టే వివిధ వ్యాపార కార్యకలాపాలకు పిఎంఇజిపి, పిఎమ్‌ఎఫ్‌ఇ, ముద్ర లోన్, విశ్వకర్మ, స్వయం సిద్ధ, నారి శక్తి, నారీభేరి, ఎంఎస్‌ఎంఇ, స్టాండప్ ఇండియా, స్వయం సమృద్ధి తదితర స్కీములు దోహద పడుతున్నాయన్నారు. వీటి ద్వారా చిరు వ్యాపారులు తాము నిర్వహించుకునే వ్యాపారాన్ని బట్టి బ్యాంకుల ద్వారా అర్హులైన వారు రుణాలు పొందవచ్చు అన్నారు. అలాంటివారు దరఖాస్తు చేసుకుంటే లోన్లు మంజూరు చేస్తారన్నారు. అయితే పిఎంఎఫ్‌ఎంఇ, పిఎంఇజిపి స్కీం ల ద్వారా సబ్సిడీ రుణాలు కూడా పొందవచ్చు అన్నారు. దరఖాస్తు చేసుకునే ఆన్లైన్ విధానంలో గ్రామస్థాయిలో విఒఎలు, మండల స్థాయిలో సిసిలు, ఎపిఎంల ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు పాలూరి గోవిందరాజు, బల్ల హరికృష్ణ, కె.రామకృష్ణ, ఎస్.సతీష్, తమ్మన ఏసు, గుడ్డుమల్ల రాంబాబు, అడబాల వీర్రాజు, తమ్మన రామకృష్ణ, పాలూరి వీరన్న, విఒఎలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు ఎంపిడిఒకు అభినందనలు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇటీవల ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన ఐ.రాజుకు మహిళ పోలీస్ సిబ్బంది ఇండోర్ ప్లాంట్ అందించి అభినందనలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పోలీసుల పాత్ర కీలకమని, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలని వారిని ఆయన కోరారు.

ఇందుపల్లి ఆర్అండ్‌బి వంతెనకు మరమ్మతులు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఇందుపల్లి ఆర్అండ్‌బి వంతెనకు గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాలిని అప్పాజీ ఆధ్వర్యంలో శనివారం ఆర్అండ్‌బి సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ వంతెన నిర్మించి ఏళ్లు గడవడంతో శిథిల స్థితికి చేరుకుందన్నారు. రెండు వైపులా రక్షణ గోడలు కూలిపోవడంతో ఆర్అండ్‌బి అధికారులు ఐరన్ గ్రిల్ నిర్మించి మరమ్మతులు చేపట్టారన్నారు. ప్రస్తుతానికి కొంతమేర ప్రమాదాలు జరగకుండా ఈ ఐరన్ గ్రిల్ ఉపయోగపడుతుందన్నారు. అయితే సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తే ప్రయాణికులకు ప్రయోజనమని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉర్రింక బుజ్జి, కార్యదర్శి రామకష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ పరిశీలన

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బిఎల్‌ఒలు ఆధ్వర్యంలో జరిగిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలను రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల పరిశీలించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం కూడా ఈ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులపై ఆరా తీశారు. కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని సమస్యలపై బాలికలు ఫిర్యాదు చేసే విధానం తెలిపారు. అనంతరం ఇక్కడ మధ్యాహ్నం భోజనం వండుతున్న తీరును పరిశీలించారు . అనంతరం జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల ను సందర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బిఎల్‌ఒ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పద్మజ, డాక్టర్ ఎన్వి రమణ, ఉపాధ్యాయులు రవిబాబు, వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పందుల సంచారంపై సమావేశం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పురపాలక సంఘం పరిధిలో పందులు సంచరించుటపై వచ్చిన ఫిర్యాదులపై పందుల యజమానులను శనివారం సమావేశం నిర్వహించారు. ప్రజల పందులతో పడుతున్న ఇబ్బందులను వారు తీసుకోవలసిన జాగ్రత్తలను మేనేజర్ తెలియజేశారు .ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు పలుమార్లు వచ్చిన సందర్భంగా పందులను యజమానులకు కట్టడి చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. దీనితోపాటు పట్టణమునకు రెండు కిలోమీటర్ల దూరంలో పందులు ఉండాలని, పట్టణంలో పందులు తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

2,420 ఎకరాల్లో సార్వా సాగు

ప్రజాశక్తి - మామిడికుదురు

మండల పరిధిలో 2,420 ఎకరాలలో రైతులు సార్వా పంట సాగు చేశారని మండల వ్యవసాయాధికారిణి బి.మృదుల తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే 150 ఎకరాల విస్తీర్ణంలో మాసూళ్లు పూర్తి చేశారన్నారు. ఇప్పటివరకు 600 క్వింటాల్ ధాన్యాన్ని ప్రభుత్వము కొనుగోలు చేసిందని అన్నారు అల్ప పీడన ప్రభావంతో కోతల వాయిదా వేసుకోవాలని ఆమె అన్నారు.

జొన్నాడలో 'భైరవం' షూటింగ్

ప్రజాశక్తి - ఆలమూరు

టాలీవుడ్ హీరోలు బెల్లంకొండ శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ లు కలిసి నటిస్తున్న మల్టీస్టారర్ మూవీ 'భైరవం'. శనివారం మండలంలోని జొన్నాడ ఇసుక ర్యాంపులో ఈసినిమా షూటింగ్ జరిగింది. బెల్లంకొండ శ్రీనివాస్‌పై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సందర్భంగా అనపర్తి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి బెల్లంకొండ శ్రీనివాస్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

కొత్తపేటలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ బండారు

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు అందజేశారు.

కొత్తపేట: . వైద్యం ఖర్చుల నిమిత్తం సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న పలువురికి కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు కొత్తపేటలోని శనివారం బండారు బులిసత్యం చంద్రావతి కాపు కళ్యాణ మండపంలో రూ.22 లక్షల 35 వేల 296 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ధరణాల రామకృష్ణ, చింతం కృష్ణమూర్తి, ముత్యాల బాబ్జి, బండారు బులితాత, బూసి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** ఇటీవలవివిధ ఆసుపత్రుల నందు వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కొరకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 16 మందికి రూ.14,97,943 ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరయ్యాయి. ఈ ు చెక్కులను శనివారం మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ సభ్యుడు, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు చేతులమీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారంతా సిఎం చంద్రబాబుకు, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావుకు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి , మల్లిపూడి గణేష్, యరగతపు బాబ్జి, రిమ్మలపూడి వేణుగోపాలదొర, వల్లూరి వీరబాబు, సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్, తదితర్లు పాల్గొన్నారు.

ఎపి పునర్నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కొత్తపేట

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక బండారు బులిసత్యం చంద్రావతి కాపు కల్యాణ మండపంలో జరిగిన పాత్రికేయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ లో విద్యకు వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. సమావేశంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావ, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు ధర్నాల రామకృష్ణ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై సిఎంకు విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని ఎబిసిడి వర్గీకరణ అమలు చేయాలని సిఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నామని తెన్నేటి కిషోర్ మాదిగ తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపిలో ఎస్సి కమ్యూనిటీ రిజర్వేషన్ యొక్క ఉప-వర్గీకరణను అమలు చేయడానికి గతంలో వర్గీకరణ అమలు అయిన విదంగానే ఇప్పుడు కూడ అమలు చేయాలని మనవిచేస్తున్నామని కోరారు. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఈతకోట రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కొడమంచిలి సాయికుమార్, రాష్ట్ర కార్యదర్శి ఉందుర్తి సత్యనారాయణ, నామవరపు సత్యనారాయణ, తొత్రముడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


అశోక్‌కు సత్కరించిన పలువురు నాయకులు

ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ అశోక్‌కు అభినందన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీకి చెందిన చెల్లి అశోక్‌ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల ఎంపికలో అశోక్ కు రాష్ట్ర ఎస్‌సి కార్పొరేట్ డైరెక్టర్‌గా నియమించింది. శనివారం టిడిపి కి చెందిన పలువురు అశోక్‌ను ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో పోతుకుర్రు మాజీసర్పంచ్ గుమ్మళ్ళ శ్రీనివాస్ సాగర్, దళిత రత్న నేదునూరి వీర్రాజు, మోర్త వీర వెంకట సత్యనారాయణ, బడుగు సాయి, పలువురు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి నరేష్

చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

మహిళలకు సంబంధించిన రక్షణ చట్టాలు, న్యాయ పరమైన అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ పేర్కొన్నారు. ఉప్పలగుప్తం మహిళ సమాఖ్య కార్యాలయంలో శనివారం విధాన్ సే సమాధాన్ పేరిట మహిళలతో న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు), జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సంయుక్త ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ పేరిట మహిళలపై జరుగుతున్నటువంటి దాడులు, నేరాలు జరగకుండా లీగల్ సర్వీసెస్ అథారిటీ, జాతీయ మహిళా కమిషన్ విశేషంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని అన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వివిధ రంగాలలో పనిచేస్తున్న మహిళలు శ్రమదోపిడికి సంబంధించిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గౌరీ శంకర రావు, స్థానిక సర్పంచ్ కడిమి చిన్నవరాజు, తహశీల్దార్ వివిఎస్.దివాకర్, ఎస్‌ఐ సిహెచ్. రాజేష్, ఎంపిడిఒ, పిఆర్‌సి రాజ్ కుమార్, వెలుగు ఎపిఎం అయితా బత్తుల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న అక్షర సేవా సంస్థ సభ్యులు

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- రావులపాలెం

బాధిత కుటుంబానికి అక్షయ సేవా సంస్థ శనివారం ఆర్థిక సాయం అందించింది. మండల పరిధి పొడగట్లపల్లి గ్రామానికి చెందిన సాన బోయిన సాయిబాబా ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి పనిచేస్తుండగా మెడపై ఇటుక పడి మెడ నరాలు నలిగి ఆపరేషన్‌కు రూ.15 లక్షల వరకు ఖర్చు అయింది. అయితే వాళ్ల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థను సహాయం కోరగా సంస్థ నుంచి రూ.10,000, సంస్థ సభ్యులు మిరియాల సుబ్బరాజు రూ.500 మొత్తం రూ.10,500 పొడగట్లపల్లి వెళ్లి అక్షయ సేవా సంస్థ సభ్యులు చేతుల మీదుగాబాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబం సంస్థ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బాల బాలాజీ ఆలయానికి రూ.3.91 లక్షల ఆదాయం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానమునకు శనివారం రూ.3,91,480 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు ఒర ప్రకటనలో తెలిపారు. ఇందులో నిత్యాన్నదానట్రస్ట్‌కు రూ.65, 470 వచ్చిందన్నారు 6,500 మంది స్వామి వారిని దర్శించుకోగా 4,000మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు.

యాత్రికుల కోసం ఆటో సౌకర్యం

ప్రజాశక్తి - కాట్రేనికోన

కుండలేశ్వరం పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడికి చేరుకునేందుకు బస్సు సౌకర్యం లేక యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు. అమలాపురం నుంచి కాట్రేనికోన వరకు బస్సు సౌకర్యం ఉంది. కాట్రేనికోన నుంచి కుండలేశ్వరం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడికి వెళ్లేందుకు యాత్రికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కాట్రేనికోనకు చెందిన పిఎస్‌ఎన్.రాజు (విలేకరు రాజు) ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో కాట్రేనికోన నుంచి కుండలేశ్వరం వెళ్లుటకు యాత్రికులకు ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్తీకమాసంలో అన్ని రోజులు ఆలయం వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం ఉం టుందని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాజు కోరారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ డివిజన్)
ఇ.పి. నెం. 65/2017
ఓ.యస్. నెం. 305/2008
డి. హెచ్. ఆర్./పిటీషనరు/ వాది:
శ్రీమతి కొనిజేటి నాగమణి, భర్త: వెంకట సుబ్బారావు, స్త్రీ, గృహిణి, వయస్సు 62 సం॥లు, డోరు నెం. 7-1-8/1, గణపతి సెంటర్, నిడదవోలు (గ్రామము/ మండలము)
జె.డి. ఆర్‌లు/ రెస్పాండెంట్లు/ ప్రతివాదులు:
(1) గుంటూరు సామ్రాజ్యం (లేటు)
(2) గుంటూరు సత్యన్నారాయణరెడ్డి
(3) శ్రీనివాసుల రెడ్డి
To:
4వ జెడిఆర్: గుంటూరు తిరుమలరెడ్డి, తండ్రి: సత్యన్నారాయణరెడ్డి, పురుషుడు, ప్రైవేటు ఉద్యోగి, వయస్సు 46 సం॥లు, కుమ్మర్ల వీధి, నిడదవోలు (గ్రామము / మండలము)
పై నెంబరు ఇ.పి. పిటీషన్‌లో 4వ జెడిఆర్ కు శ్రీ కోర్టు మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపించిననూ 4వ జెడిఆర్ సేల్ నోటీసులు పంపించిననూ 4వ జెడిఆర్ సేల్ నోటీసులు తీసుకొని యుండలేదు. కాబట్టి పై నెంబరు ఇ.పి. పిటీషన్‌లో 4వ జెడిఆర్‌కు ఎటువంటి ఆక్షేపణలు ఉన్ననూ పై కోర్టు వారి ఎదుట **ది. 06-12-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఇ.పి. పిటీషను తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
ఎస్.సుబ్బారావు
కొవ్వూరు అడ్వకేటు, కొవ్వూరు
ది.16-11-24 సెల్: 9492917811

పత్రికా ప్రకటన
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
In the Court of the Senior Civil Judge, Ramachandrapuram
E.A. No. 77/2023 in EPSR No. 87/2023 in O.S. No. 117/2018
Between:
Yalamati Rama Rao ...*Petitioner/ DHr*
AND
Chitturi Seshavataram (died) & Others
...*Respondents/ Proposed Parties/ JDrs*
3rd Respondent/ Proposed Party:
Katturi Kumari, D/o. late Ramarao, age 40 years, Occ: House wife, C/o. Ch.Satyanarayana, D.No. 2-10/2, Kondapallivari Veedhi, R/o. Mandapeta, Mandapeta Mandal, Alamuru PJCJ.
పై నెంబర్ గ్రంథంలో పై Chitturi Seshavataram చనిపోగా అతని యొక్క ముఖ్య వారసులుగా చేరిపించమని పై వాది/ పిటీషనరు పై నెంబరు గ్రంథంలో పై వాది పరిహారం నిమిత్తం పై కోర్టులో మీపై E.A. 77/2023 ను దాఖలు చేయగా, సదరు కోర్టు వారు అనేక పర్యాయములు నోటీసులు కోర్టు నుండి పంపగా మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందుపై శ్రీ కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసులు అమలు జరుపుటకు ది.వి. 28-11-2024వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు గాని, మీ తరుపున ప్లీడరు గాని శ్రీ కోర్టు వారి ఎదుట **ది.వి. 28-11-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** హాజరు అయ్యి మీ తరుపున ఆక్షేపణలు ఏమైనా ఉంటే దాఖలు చేయగలరు. లేని యెడల మీ తరుపున శ్రీ కోర్టు వారు పరోక్షము ఉత్తర్వులు చేయగలరు.
CHINTAPALLI SRINIVASA RAO, Advocate
రామచంద్రాపురం Ramachandrapuram
తేది:23-11-2024 Cell: 95534 51503

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ **శ్రీ ముద్రకోళ శ్రీనివాస్**, తండ్రి ముద్రకోళ వెంకటేశ్వరరావు గార్కి పొన్నమండ గ్రామంలో గల డాక్యుమెంట్ నెంబర్ 1911/2020 శెటిల్‌మెంట్ డాక్యుమెంట్ పొందియున్నారు. సదరు ఆస్తిని గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నందు ఋణం తీసు కొనుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్ ఒరిజనల్స్ రిజిస్టర్ దస్తావేజు నెంబర్ 1911/2020 (తేది.17-07-2020) ఈ రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్‌కు లింకు డాక్యుమెంట్‌గా ఉన్న 785/2003 (తేది.22-05-2003). ఈ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం పొన్నమండ ఇంటి దగ్గర నుండి అమలాపురం వచ్చే దారిలో పడిపోవడం జరిగింది. వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజనల్ లింకు డాక్యుమెంట్ పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా పారీఖత్తు 785/2003 (తేది.22-05-2003). దీనికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ పారీఖత్తు 785/2003 మరియు 1911/2020 యొక్క ఒరిజనల్ డాక్యుమెంట్స్ సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపోజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజనల్ డాక్యుమెంట్స్ కనుగొన్న లేదా దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లయింట్ చిరునామాకు వాపస్ చేయగలరు. ఇంకనూ తెలియజేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు ఎవరైన వీటిని వినియోగించిన ఎడల చట్ట విరుద్ధమగును మరియు వారిపై అవసరమైన చట్టమైన చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.
ఎన్.రమేష్, అడ్వకేట్ & నోటరీ,
అమలాపురం. సెల్:8008027999

వెంకటాయపాలెంలో శెట్టిబలిజ వన సమారాధన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వెంకటాయ పాలెం గ్రామంలో శనివారం శెట్టిబలిజ కార్తీక వన సమారాధన కార్యక్రమం ఘనవంగా నిర్వహించారు. సుమారు 6000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యులు, వైసిపి నాయకులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొని మాట్లాడుతూ శెట్టిబలిజ కులమే తనను ఇంతటి వాడిని చేసిందన్నారు. కార్యక్రమంలో టిడిపి పాలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, డాక్టర్ యనమదల మురళీ యెఔష్ణ, డాక్టర్ కాద వెంకటరమణ,


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

బిసి సంఘం నాయకులు కట్ట సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ ఆఫీసర్ కావలెను
సేఫ్టీ ఆఫీసర్ :
ఫ్యాక్టరీల చట్టం 1948లోని సెక్షన్ 40(బి) మరియు AP ఫ్యాక్టరీస్ రూల్స్ 1950లోని 61(ఎ) ప్రకారం మేము మా ఫ్యాక్టరీ కోసం సేఫ్టీ ఆఫీసర్ పోస్ట్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము.
అర్హతలు / అనుభవం :
1) డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆంధ్రప్రదేశ్ ద్వారా చట్టం ప్రకారం గుర్తించబడిన RLI / రాష్ట్ర టెక్నికల్ బోర్డు - AP నుండి ఇండస్ట్రియల్ సేఫ్టీ డిప్లమా.
2) ఏదైనా ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో గుర్తింపు పొందిన ఫుల్ టైం డిగ్రీ / డిప్లమా లేదా సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ మరియు సంబంధిత అనుభవం కలిగి ఉండాలి.
3) అభ్యర్థి తప్పనిసరిగా స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి
ఆసక్తి గల అభ్యర్థులు ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు కవరు పై భాగమున "సేఫ్టీ ఆఫీసర్ పోస్ట్ కోసం దరఖాస్తు" అని సూచిస్తూ దరఖాస్తు చేయవలెను.
ADITYA BIRLA GRASIM
హ్యూమన్ రిసోర్సెస్ విభాగము
గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ - కెమికల్ డివిజన్
సర్వే 1-4, కనేడుమెట్ట, బలభద్రపురం గ్రామం, బిక్కవోలు మండలం.
తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ - 533 343.
ఈ-మెయిల్ : recruitment.bbpuram@adityabirla.com